ప్రజాశక్తి
మంగళవారం 14 నవంబరు 2023

బాలల హక్కుల రక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు

శ్రీకాకుళం : బాలల హక్కుల రక్షణకు నవంబరు, డిసెంబరులో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి బి.శాంతిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని 14 నుంచి 20వ తేదీ వరకు పలు స్థాయిల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెలలో దత్తత మాసోత్సవాలు నిర్వహిస్తూ ప్రజల్లో దత్తత కార్యక్రమాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 20 నుంచి డిసెంబరు పదో తేదీ వరకు పలు ప్రాంతాల్లో బాల కార్మికులను గుర్తించి, వారిని రక్షించే కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వీటితోపాటు బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

పోలాకి : చెల్లాయివలసలో ఎండిన వరి

- నాగావళిలో జీరో ఇన్‌ఫ్లో
- తోటపల్లి, మడ్డువలస ఆయకట్టు రైతుల తీవ్ర ఇబ్బందులు
- వంశధారలో నామమాత్రపు ప్రవాహం
- కీలక దశలో సాగు కష్టాలు

జిల్లాలో కరువు పరిస్థితులు అంతకంతకూ తీవ్రతరమవుతున్నాయి. నెల రోజులకు పైగా వర్షాలు లేకపోవడంతో, చివరి తడులకు నీరు లేక వేసిన పంటలు ఎండిపోతున్నాయి. జిల్లాలో ప్రధాన నదులైన వంశధార, నాగావళి మునుపెన్నడూ లేని రీతిలో ఎండిపోయాయి. దీంతో పంట కాలువలకు చుక్క నీరు విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. వంశధార, తోటపల్లి, మడ్డువలస రిజర్వాయర్ ఆయుకట్టు భూములు ఎండిపోతున్నాయి. చివరి ప్రయత్నంగా రైతులు సమీపంలోని చెరువులు, నీటికుంటల నుంచి నీరు తోడి పంటలను కాపాడుకుంటున్నారు.

చివరి తడులకూ నీరు కరువు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో వంశధార, మడ్డువలస, నారాయణపురం ఆయకట్టు ప్రధాన సాగునీటి వనరులుగా ఉన్నాయి. వంశధార ప్రాజెక్టు ద్వారా హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందించాల్సి ఉంది. కాలువల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేయక, షట్టర్లు పాడైపోవడం, కాలువల్లో పెద్దఎత్తున గుర్రపు డెక్క పేరుకుపోవడంతో గొట్టాబ్యారేజీ వద్ద నీళ్లు ఉన్నా రెండు కాలువల కింద మొత్తం 60 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందలేదు. ప్రస్తుతం కీలకమైన దశలో ఉన్న పంటకూ నీరు అందని పరిస్థితి నెలకొంది. వంశధార క్యాచ్‌మెంట్ ఏరియాలోనూ వర్షాల్లేకపోవడంతో, గతంలో ఎన్నడూ లేని విధంగా ఇన్‌ఫ్లో వెయ్యి నుంచి 1100 క్యూసెక్కులకు పడిపోయింది. గతేడాది ఇదే సీజన్ నాలుగు వేల క్యూసెక్కుల వరకు నీటి ప్రవాహం ఉండేది. కాలువల్లోకి నీరు విడిచిపెట్టాలంటే కనీసం 2,750 క్యూసెక్కులు ఉండాలి. దీంతో హిరమండలం రిజర్వాయర్‌లో ఉన్న కొద్దిపాటి నీటిని 19 మండలాలకు గానూ ఆరేడు మండలాలకు నీరందిస్తున్నారు. అదీ ఎన్ని రోజులు విడిచిపెడతారో తెలియని పరిస్థితి నెలకొంది. హిరమండలం రిజర్వాయర్‌లో ఉన్న నాలుగు టిఎంసిల నీటి నిల్వలకు గానూ ఇప్పటివరకు 1.50 టిఎంసిల నీరు వదిలారు. డెడ్ స్టోరేజీ కింద రెండు టిఎంసిలు ఉంచాల్సి ఉంది. దీంతో మరో 0.5 టిఎంసిల నీటినే విడిచిపెట్టే అవకాశం ఉంది.



పోలాకి మండలం చెల్లాయివలసలో చెరువు నీటితో పంటకు నీరు పెడుతున్న రైతు

నాగావళిలో జీరో ఇన్‌ఫ్లో

నాగావళిలో ప్రస్తుతం ఇన్‌ఫ్లో జీరోగా ఉంది. నాగావళి నదిపై తోటపల్లి, మడ్డువలస, నారాయణపురం ఆయకట్టు ఆధారపడి ఉంది. తోటపల్లి ప్రాజెక్టు ద్వారా పాత ఆయకట్టు ద్వారా 30 వేల ఎకరాలు ఉంది. మడ్డువలస ద్వారా ఆరు వేల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. ఖరీఫ్‌లో రెండింటికీ కలిపి 30 వేల ఎకరాల వరకే నీరందిగలిగారు. ప్రస్తుతం నదిలో ఇన్‌ఫ్లో ఏమీ లేకపోవడంతో, చివరి తడులకు నీరందని పరిస్థితి నెలకొంది. తోటపల్లి, మడ్డువలస నుంచి కొంతమేర నీటిని జిల్లా పరిధిలోని ఆయకట్టుకు విడిచిపెడుతున్నారు. ఒడిశాలో వర్షాలు లేకపోవడంతో, వాటిలోనూ నీటిమట్టం నిల్వలు తగ్గిపోతున్నాయి. తోటపల్లి బ్యారేజీ నీటి సామర్థ్యం 2.51 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 1.75 టిఎంసిల నీరే ఉంది. మడ్డువలస రిజర్వాయర్ నీటి సామర్థ్యం 3.37 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 1.3 టిఎంసిలకు పడిపోయింది. జిల్లా అవసరాలకు నీటిని విడిచిపెడుతుండడంతో, తమ ప్రాంత రైతులు ఇబ్బందులు పడతారంటూ విజయనగరం జిల్లా అధికారులు ప్రస్తుతం ఇప్పటివరకు విడిచిపెడుతున్న నీటినీ ఆపేశారు.

నాలుగు ఎకరాలు ఎండిపోయింది

నేను ఆరు ఎకరాల్లో వరి వేశాను. వర్షాలు లేకపోవడంతో నాలుగు ఎకరాలు ఎండిపోయింది. వంశధార కాలువల్లో నీరు లేకపోవడంతో ఇంజిన్లు పెట్టి పొలాన్ని తడిపాను. రెండు ఎకరాలే బతికింది. నాలుగు ఎకరాలకు రూ.50 వేల వరకు ఖర్చు చేశాను. పంట పోవడంతో నష్టపోయాను. కరువు మండలంగా ప్రకటించి ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

- బి.ధనుంజయరావు, నౌగాం, నందిగాం మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి

నాలుగు ఎకరాల్లో వరి వేశాం. వర్షాల్లేక పంట ఎండిపోతోంది. చివరి తడులకు నీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇంజిన్లు పెట్టి పంట తడుపుతున్నాం. ఈ సంవత్సరం చాలా మదుపులు ఆయ్యాయి. పంట చేతికి వస్తుందో, లేదో తెలియదు. పంట నష్టపోయిన రైతలకు ప్రభుత్వం సాయమందించాలి.

- టెంక సూర్యనారాయణ చెల్లాయివలస, పోలాకి మండలం

రిజిస్ట్రేషన్ ఇక సులభతరం

- నేటి నుంచి కార్డు ప్రైమ్ 2.0 అమలు
- నూతన రిజిస్ట్రేషన్ విధానంతో మధ్యవర్తులకు చెల్లుచీటీ
- ఆన్‌లైన్‌లో డాక్యుమెంటేషన్

భూముల రిజిస్ట్రేషన్ అంటే పెద్ద ప్రహసనమే. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఏ పనీ ముందుకు సాగదు. ఇక అటువంటి కష్టాలకు ప్రభుత్వం చెక్ పెడుతోంది. రిజిస్ట్రేషన్ సేవలను సులభతరం చేసేందుకు నూతన విధానాన్ని తీసుకొచ్చింది. కార్డ్ ప్రైమ్ 2.0 ద్వారా వినియోగదారులకు కచ్చితత్వంతో కూడిన లావాదేవీలతో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పారదర్శకంగా ఉండనుంది. మధ్యవర్తులపై ఆధారపడకుండా ప్రజలు సులువుగా రిజిస్ట్రేషన్లు చేసుకునేలా ఈ విధానాన్ని తీసుకొచ్చింది. వినియోగదారులే ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ తయారు చేసుకునే ఈ విధానంలో 20 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కానుంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో రోజంతా పడిగాపులు కాయాల్సి వచ్చేది. డాక్యుమెంట్ రైటర్లు, మధ్యవర్తుల ప్రమేయం, పర్యవేక్షణలో డాక్యుమెంట్ తయారీ, చలానా కట్టడం, స్లాట్ బుకింగ్ వంటివన్నీ జరిగేవి. చలానా నిర్దేశించిన బ్యాంకు పరిధిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న రోజునే చెల్లించాల్సి వచ్చేది. చలానాతో పాటు సంబంధిత పత్రాలను పూర్తి చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంటు రైటర్లు అందజేస్తే, సబ్ రిజిస్ట్రార్ సమక్షంలో రిజిస్ట్రేషన్ జరిగేది. ఇదో పెద్ద ప్రహసనంగా క్రయ, విక్రయదారులు భావించేవారు. ఇక్కడా పెద్దఎత్తున నగదు చేతులు మారేది. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత దస్తావేజులు చేతికి రావాలంటే నాలుగు రోజుల సమయం పట్టేది. వందేళ్ల నాటి రికార్డులు సైతం రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉండడం వల్ల లోపాలను గుర్తించేందుకు వీలుండేది.

కొత్త విధానం ఎలా ఉంటుందంటే...

రాష్ట్ర ప్రభుత్వం భూముల క్రయ విక్రయ విధానంలో సరికొత్త మార్పులు తీసుకొచ్చింది. గతంలో సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని చెప్పిన ప్రభుత్వం, ఆ దిశగా ప్రయత్నాలు చేపట్టింది. కొన్ని కారణాల రీత్యా దీన్ని పట్టాలెక్కించడం సాధ్యం కాలేదు. తాజాగా ప్రభుత్వం కార్డ్ ప్రైమ్ 2.0 విధానాన్ని తీసుకొచ్చింది. తక్కువ సమయంలో సులభంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేసుకునేందుకు ఈ విధానంలో వీలవుతుంది. డాక్యుమెంటు రైటర్లతో పని లేకుండా వినియోగదారులే ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్ తయారు చేసుకోవచ్చు. ఆస్తి వివరాలు, పేరు, ఆధార్, సాక్షులు వంటి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తే వెంటనే ఆస్తి మార్కెట్ విలువ, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ ఛార్జీలు ఎంత కట్టాలో చూపిస్తుంది. ఆ సొమ్మును ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. ఆఫ్లైన్, స్టాక్ హోల్డింగ్ ద్వారా కూడా చలానా కట్టే అవకాశముంది. అనంతరం రిజిస్ట్రేషన్ టైమ్ స్లాట్ బుక్ చేసుకుని, ఆ సమయానికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్లు, వివరాల ఆధారంగానే పరిశీలిస్తారు. సబ్ రిజిస్ట్రార్ ఈ-సిగ్నేచర్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగుస్తుంది. భూములకు సంబంధించిన అన్ని వివరాలు, పత్రాలు ఆన్‌లైన్‌లో జత చేయడం వల్ల 20 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. తదనంతరం డాక్యుమెంట్‌ను ఆన్‌లైన్‌లోనే డౌన్‌లోడ్ చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా పొందవచ్చు.

నేటి నుంచి అమలు

జిల్లాలో కార్డు ప్రైమ్ 2.0 విధానం ఈనెల 14వ తేదీ నుంచి అమలు కానుంది. దీని ద్వారా రిజిస్ట్రేషన్ కోసం క్రయ, విక్రయదారులు మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన పని ఉండదు. ఆన్‌లైన్‌లో సక్రమంగా డాక్యుమెంట్ ఉంటే రిజిస్ట్రేషన్‌కు ఆటంకం ఉండదు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఎవరినీ ఆశ్రయించాల్సిన, అదనంగా డబ్బులు చెల్లించాల్సిన అవసరం ఉండదు.

- కూన మన్మథరావు జిల్లా రిజిస్ట్రార్

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

షెడ్యూల్‌ను విడుదల చేస్తున్న విజయ్‌కుమార్

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సందర్శకుల సౌకర్యార్థం రాష్ట్రంలోని అమరావతి (అమరారామం), భీమవరం (భీమారామం), పాలకొల్లు (శ్రీరారామం), ద్రాక్షారామం, సామర్లకోట (కుమారారామం) క్షేత్రాలకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. ఈమేరకు స్థానిక ఆర్‌టిసి కార్యాలయంలో టూర్ షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేశారు. పంచారామ క్షేత్రాలను సందర్శించుకునే అవకాశాన్ని ఆర్‌టిసి ఈనెల 19, 26, డిసెంబరు 3, 10వ తేదీల్లో కల్పిస్తోందన్నారు. పలాస, టెక్కలి, శ్రీకాకుళం డిపోల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపారు. ఈ యాత్రకు వెళ్లే వారి కోసం సూపర్ లగ్జరీ, ఆల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుబాటులో ఉంచామన్నారు. ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయం www.apsrtconline.in (శ్రీకాకుళం నుంచి పంచారామాలు) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఆయా తేదీల్లో సాయంత్రం నాలుగు గంటలకు బయలుదేరి సోమవారం ఐదు క్షేత్రాలను సందర్శించిన తర్వాత మంగళవారం ఉదయం ఆరు గంటలకు గమ్యానికి చేర్చనున్నట్లు చెప్పారు. ఏదైనా గ్రామం నుంచి పూర్తి బస్సు అద్దె ప్రాతిపదికన టిక్కెట్లు కొనుగోలు చేస్తే, వారికి ఇంటి వద్దకే బస్సును పంపిస్తామన్నారు. బస్సు ఛార్జీలు ఒక వ్యక్తికి శ్రీకాకుళం నుంచి సూపర్ లగ్జరీ రూ.2,400, ఆల్ట్రా డీలక్స్ రూ.2,350, ఎక్స్‌ప్రెస్ రూ.2,000 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ 9959225608, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) 7095040608, శ్రీకాకుళం రెండో డిపో మేనేజరు 9959225609, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్): 7382917289 టెక్కలి డిపో మేనేజర్ 9959225611, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్): 7382923311 పలాస డిపో మేనేజరు 9959225610 అసిస్టెంట్ మేనేజర్, (ట్రాఫిక్) 7382924758ను సంప్రదించాలని సూచించారు.

ధర్నా చేస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులు

బస్సులను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- పలాస

పలాస డిపో పరిధిలో ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నంకు తిరుగుతున్న 10 ఎక్స్‌ప్రెస్ బస్సులు నెల రోజులుగా నిలిపివేశారని, వాటిని వెంటనే పునరుద్ధరించాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పి.భానుమతి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌టిసి డిపో వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలను నిత్యం గమ్యస్థానాలకు చేరుస్తూ సేవలను అందిస్తున్న ఆర్‌టిసిని లాభ, నష్టాలతో సంబంధం లేకుండా నడుపుతామని చెప్పి ప్రభుత్వంలో విలీనం చేశారని అన్నారు. పలాస డిపో పరిధిలో నెల రోజుల నుంచి పది ఎక్స్‌ప్రెస్ బస్సులు. నిలిపివేశారని అన్నారు. దీనిపై డిపో మేనేజర్‌ని ఉద్యోగులు వివరణ కోరగా, నష్టాలు కారణంతో శ్రీకాకుళం డిపిటిఒ ఆదేశాల మేరకు ఆ పది బస్సులు నిలుపివేశామని తెలిపారని అన్నారు. ఈ బస్సులు నిలిపివేయడంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందన్నారు. ప్రయివేటు ఆపరేటర్లకు లబ్ధిచేకూరే విధంగా ఇటువంటి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. తక్షణమే బస్సుల పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి బి.కె.మూర్తి. జిల్లా అధ్యక్షులు జి.త్రినాథ, జిల్లా కార్యదర్శి కె.దశరథుడు, డిపో నాయకులు ఎ.దిలీప్‌కుమార్, ఎం.ఎ.రాజు, చిన్న, ఎల్.డి.రావు, మెట్ట సూర్యనారాయణ పాల్గొన్నారు.

24 నుంచి ఎస్‌ఎ పరీక్షలు

ప్రజాశక్తి - టెక్కలి



ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన ఎస్ఎ (సమ్మేటివ్ ఎసెస్‌మెంట్) పరీక్షలు ఈనెల 24వ తేదీకి వాయిదా పడ్డాయి. విద్యాశాఖ ముందుగా విడుదల చేసిన పరీక్షల కాలనిర్ణయ పట్టిక తేదీలను మార్చుతూ తాజాగా విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 17 తేదీ నుంచి ఎస్ఎ పరీక్షలు నిర్వహించాల్సి ఉన్నా గ్రంథాలయ వారోత్సవాలు, సైన్స్ ఎగ్జిబిషన్లు ఉండడంతో ఈనెల 24వ తేదీకి వాయిదా వేశారు. మెదటి రెండు రోజులు కాంపోజిట్ కోర్సులకు పరీక్షలు నిర్వహించనుండగా, 28వ తేదీ నుంచి అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉన్నత పాఠశాలలకు చెందిన 6, 8, 10 తరగతుల విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించనుండగా, 7, 9 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 1.30 నుంచి 4.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఎప్పటి మాదిరిగానే ఆంగ్లం, తెలుగు మాధ్యమంలో పరీక్షలు నిర్వహిస్తారు. 24న ప్రారంభం కానున్న పరీక్షలు వచ్చే ఏడాది జనవరి ఆరో తేదీ వరకు నిర్వహించనున్నారు. ఏటా జనవరి ఒకటో తేదీ ఐచ్ఛిక సెలవు ఉన్నా, ఎస్ఎ పరీక్షల కారణంగా ఆ సెలవును రద్దు చేశారు. ఈ మేరకు నిర్దేశించిన సిలబస్‌లను పూర్తి చేసి విద్యార్థులను సన్నద్ధం చేయనున్నారు.

'ఉపాధి'లో రాష్ట్రం ఆదర్శం

కాగ్ రాష్ట్ర ఇన్‌ఛార్జి ప్రియాంక నశీనా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధి హామీలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) రాష్ట్ర ఇన్‌ఛార్జి ప్రియాంక నశీనా అన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సోమవారం దర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివెట్టి మండపంలో శేష వస్త్రాలు, మెమోంటోలను వారికి అందజేశారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇతోధికంగా నిధులు కేటాయిస్తోందన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది రూ.24 వేల కోట్లను విడుదల చేసినట్లు వివరించారు. 2021 నుంచి ఆర్థిక శాఖలో పూర్తిస్థాయి సంస్కరణలు చేపట్టినట్లు చెప్పారు. ఆర్థిక రంగం పారదర్శకంగా ఉండేందుకు, రాష్ట్రాలకు కేటాయించే నిధులు సకాలంలో వ్యయం కావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకానికి రూ.7,500 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కలిసి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ముందుగా రాష్ట్ర ప్రభుత్వాలు వాటా జమ చేస్తే అనంతరం కేంద్రం మాచింగ్ గ్రాంట్ కలుపుతుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం 22 రకాల అభివృద్ధి పనులకు రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాలు సిఎఫ్‌ఎంఎస్ తరహాలో కేంద్ర ప్రభుత్వం పిఎఫ్‌ఎంఎస్ అమలు చేస్తోందని చెప్పారు. దశాబ్దాలుగా మరమ్మతుల్లేక సాగునీరు అందని సాయన్న ఛానల్ ఆధునికీకరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. దీనికింద ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రేగిడి ఆమదాలవలస మండల పరిధిలో సుమారు 12 వేల ఎకరాలు సాగవుతుందన్నారు. త్వరలో టెండర్లు పిలిచి, పనులు ప్రారంభిస్తారని తెలిపారు.

కరువు దుస్థితి పట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి - గార

వర్షాభావ పరిస్థితులతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు తాండవిస్తున్నా, రైతాంగాన్ని ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి విమర్శించారు. మండలంలోని అంపోలు పంచాయతీ పరిధిలో పంట పొలాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంశధార నదిలో నీరున్నా రైతాంగానికి ఈ ఏడాది సాగునీరందలేదని, ఈ పరిస్థితికి ప్రభుత్వమే కారణమని ధ్వజమెత్తారు. వంశధార కుడి కాలువ ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరందించాల్సి ఉన్నా పట్టించుకోలేదన్నారు. కాలువల్లో పూడికతీతకు నిధులు ఇవ్వకపోవడం వల్ల శివారు ప్రాంతాలకు సాగునీరు అందలేదని విమర్శించారు. గతంలో శివారు ప్రాంతాలకు సాగునీరు విడుదల చేసిన తర్వాత చెరువుల్లో నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉండేదని, ఈ ఏడాది ఆ పరిస్థితి లేకుండా పోవడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో గార మండల రైతాంగానికి సాగునీరందించేందుకు రూ.2.75 కోట్లతో ఎత్తిపోతల పథకం మంజూరు చేసి 75 శాతం పూర్తి చేసినా, మిగిలిన 25 శాతం పనులు పూర్తి చేయకుండా వైసిపి ప్రభుత్వం మధ్యలో విడిచిపెట్టిందని విమర్శించారు. దీనివల్ల రైతులకు సాగునీరు అందకుండా పోయిందన్నారు. తక్షణమే ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అంబటి చక్రధర్, పొట్నూరు కృష్ణమూర్తి, జల్లు రాజీవ్, వెలమల శ్రీనివాస్, రుప్ప ముసలినాయుడు, వెలమల రమణ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న గుండ లక్ష్మీదేవి

IN THE HONOURABLE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL CUM PRL.DISTRICT JUDGE; AT VIZIANAGARAM
MOP:232/2023

Between:
Yeduri Latha & others ..... Petitioners
And:
Sanoj Naik & others ......Respondents

R-1: Sanoj Naik, s/o Bijaya Naik, Driver of Temo Force Vehicle bearing No:OD33AA0377 Badabhumi, Gayaganda, Ganjam dist.

NOTICE

Please take notice that the above MOP stands posted to **24-11-2023** for notice to the Respondent No.1. you should appear in person or through an advocate at **10-30 a.m.** on the above said date in the above court.
If you fail to appear on the said date the above matter will be decided expartee.

P.Dhananjaya Rao
Advocate
Vizianagaram,
Cell: 9440711430

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE ICHAPURAM.
OS.4/2021

Between:
Tippala Dudamma ...Plaintiff
And:
Buddupu Balakrishna ...Defendant

To,
Buddupu Balakrishna, S/o Bheemayya, aged 37 years, r/o Main Road, Haripuram Village,Ichapuram Mandalam, Srikakulam District, A.P.

NOTICE

Please take notice that the above named Plaintiff filed the above suit before the Hon'ble Court of Junior Civil Judge, Ichapuram against you for recovery of suit amount and the matter is posted to **16-11-2023** for your appearance before the Hon'ble Court of Junior Civil Judge, Ichapuram at **10.30 A.M.** on the said date in person or through your Counsel or else the matter will be decided in your absence.

SRI BHAGAVAN DAS
Advocate,
Ichapuram,
Srikakulam District.

ఎజిబిఎస్‌సికి ఇద్దరు ఎంపిక

ఎంపికైన విద్యార్థినులు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపిసి విద్యనభ్యసించి రిలీవ్ అయిన ఇద్దరు విద్యార్థులు అగ్రికల్చర్ బిఎస్‌సిలో సీట్లు సంపాదించారని కళాశాల ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు సోమవారం తెలిపారు. మండలంలోని గోనెపాడుకు చెందిన గొండు సోమేశ్వరరావు కుమార్తె గొండు శ్రావణికి గుంటూరు జిల్లా బాపట్లలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ బిఎస్‌సిలో సీటు లభించిందన్నారు. ఈ ఏడాది సరుబుజ్జిలి ప్రభుత్వ కళాశాలలో బైపిసి చదివిన శ్రావణి 950 మార్కులు సాధించిందని తెలిపారు. మండలంలోని పర్వతాలుపేటకు చెందిన చిన్నాల శ్రీనివాసరావు కుమార్తె రిషితకు రాజమండ్రి ఆచార్య ఎన్‌జి రంగా యూనివర్సిటీలో అగ్రికల్చర్ బిఎస్‌సిలో సీటు లభించిందన్నారు. రిషితకు బైపిసిలో 940 మార్కులు వచ్చాయన్నారు. తమ కళాశాల విద్యార్థులు ప్రతిష్టాత్మక అగ్రికల్చర్ బిఎస్‌సిలో సీట్లు సాధించడంపై అధ్యాపకులు రమేష్ సాహూ, విజయకుమార్, గొండు శ్రీనివాసరావు, రామకృష్ణ, వినోద్‌రాజు, గౌతమిలను అభినందించారు. గతేడాది కాంపిటీటివ్ సెల్ నిర్వహించిన పూర్వ అధ్యాపకులు గణపతి ధనుంజయరావు, చిన్నారావు, పూర్వ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి దుగ్గివలస రాంప్రసాద్ సహకారంతో తాము పోటీ పరీక్షల్లో రాణించగలిగామని రిషిత, శ్రావణి తెలిపారు.

పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

మానసిక వేదనకు గురవుతున్న కార్మికులు

రణస్థలం: శ్యాంపిస్టన్స్‌లో బలవంతపు ఉద్యోగ విరమణను నిలుపుదల చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, శ్యాంక్రగ్ పిస్టన్స్ (రింగ్స్) వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొర్లె కిరణ్ డిమాండ్ చేశారు. మండలంలోని శ్యాంక్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ ప్లాంట్-2 పరిశ్రమలో యాజమాన్యం 30 ఏళ్ల సర్వీసు కాకుండానే పూర్తయిందనే నెపంతో కార్మికులను బలవంతంగా ఉద్యోగ విరమణ చేయించారని అన్నారు. దీంతో మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విధంగా తొలగించడంతో ఆర్థిక ఇబ్బందులతో మానసిక క్షోభకు గురై, వేరే ఉపాధి కోసం చేసే ప్రయత్నంలో కార్మికుడు వై.వెంకటేశ్వర్లు రోడ్డు ప్రమాదానికి గురయ్యారని అన్నారు. మెదడుకు తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లి విశాఖపట్నంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని అన్నారు. విషయం తెలుసుకున్న వారు విశాఖ వెళ్లి వెంకటేశ్వరరావును సోమవారం పరామర్శించారు. పరిశ్రమలో కార్మికులెవరికీ తెలియని స్టాండింగ్ ఆర్డర్‌ని సాకుగా చూపించి యాజమాన్యం ఈ విధమైన బలవంతపు ఉద్యోగ విరమనకు పాల్పడుతుందని అన్నారు.

నేడు రాజకీయ పార్టీలతో సమావేశం

రణస్థలం రూరల్ : ఎస్ఎస్ఆర్-2024 ప్రకారం ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నామని ఎన్నికల డిటి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, సభ్యులు హాజరు కావాలన్నారు.

ఆదరణ తగ్గని తప్పెటగుళ్లు

- పలు రాష్ట్రాల్లో ప్రదర్శనలు
- ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత ముందుకు...

ప్రజాశక్తి- మెళియాపుట్టి

యాదవులు ప్రదర్శించే తప్పెటగుళ్లు కొన్ని వందల సంవత్సరాలుగా చెక్కు చెదరకుండా ఈ కళారూపాన్ని కాపాడుకొచ్చారు. ప్రస్తుతం ఈ తప్పెటగుళ్ల ప్రదర్శించే వారు కరువయ్యారు. ఎక్కడో అరకొరగా కనిపిస్తుంటారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దేవుని సంబరాలు చేయాలంటే తప్పెటగుళ్లు తప్పనిసరి. తప్పెటగుళ్లను యాదవులే ప్రదర్శించేవారు. కానీ, చాలామంది ఆ కళకు దూరమై, మేకలు, గొర్రెల మందలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. విద్యకు దూరమై పొద్దంతా గొర్రెలను, మేకలను పొలాల్లోనూ, అడవులలోనూ మేపుకుని రాత్రిపూట మందల వద్ద కాపలా కాస్తుంటారు. వీరు ఒంటరితనాన్ని మరచిపోవడానికి వీరునోట నుంచి అనేక రకాలైన పాటలు వస్తుంటాయి. కుటుంబాలకు దూరంగా, రాత్రి పూట మేకల, గొర్రెల మందలకు కాపలాకాస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ తప్పెటగుళ్ల కళారూపం జిల్లాలో ఇప్పటికీ కనిపిస్తూ ఉంటుంది. యాదవులు గుండెకు రేకుతో తయారు చేసిన ఒక చిన్న డప్పువంటి దానితో ధ్వనులు చేసేవారు. అలా కొంతకాలం తరువాత దానికి తప్పెటగుళ్లు అని నామకరణం చేశారని పెద్దలు చెప్తున్నారు. ప్రస్తుతం క్రమేణా కనుమరుగై పోతుందని యాదవులు అంటున్నారు.

ఆకట్టుకునే ప్రదర్శనలు

తప్పెటగుళ్లను ప్రదర్శించేటప్పుడు వీరు రంగురంగుల బనియన్లు ధరిస్తారు. కాళ్లకు గజ్జెలు కట్టుకొని ఒకే విధమైన రంగు రంగుల నిక్కర్లను తొడిగి, లంగోటి లాంటి గోచీలను ధరించి, తప్పెటగుళ్లను వాయిస్తూ కేకలతో, అరుపులతో కేరింతలు కొడుతూ... ఆనందంగా గుండ్రంగా తిరుగుతూ శాస్త్రీయమైన అడుగులతో అందరూ గంతులేస్తూ, గెంతుతూ సుదీర్ఘ రాగాలతో ఆలాపన చేస్తూ తప్పెటలను కొడుతూ పాటలు పాడతారు. జట్టు నాయకుడే కీలకం ఆయన మాట ప్రకారమే ప్రదర్శన జరుగుతుంది. లయబద్ధంగా నృత్యం చేసే ఈ బృందాల్లో 15 నుంచి 20 మంది వరకూ ఉంటారు. తాళం, లయ తప్పకుండా, క్రమం తప్పకుండా వలయాకారంలో తిరుగుతూ వీరు చేసే నృత్యం కన్నులపండువగా ఉంటుంది. నెత్తిన చెంబూ, కాళ్ల కింద పళ్ళెం మాదిరి వీరూ నీరు నింపిన మట్టికుండ అంచులపై ఒకరు నిలబడితే, అతనిపై మరో వాద్యకారుడు తప్పెటలను వాయిస్తూనే నీరు నిండిన కుండను నెత్తిన పెట్టుకుని వీరు తొణకకుండా, ఒక పక్క తప్పెట వాయిస్తూ నీరు తొణికి పోతాయేమో అనే దృష్టి లేకుండా నృత్యం చేస్తూ ఉంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఉన్నత చదువులు చదవకపోయినా గుక్కపట్టి రాగాలు తీసి పాటలు పాడటం వారి ప్రత్యేకత. అది ఆ నాటి కళింగాంధ్ర దేశంలో ఉత్తమ కళారూపంగా వెలుగొందిన జానపద కళారూపం. మండలంలోని

జార్ఖండ్‌లోని జాతరలో తప్పెటగుళ్ల ప్రదర్శన

చీపురుపల్లి, మర్రిపాడు-సి, మర్రిపాడు-కె, జలకలింగుపురం, చాపర, మాకనపల్లి, సంతలక్ష్మీపురం, కరజాడ గ్రామాలలో ఇప్పటికీ ఈ కళను ప్రదర్శించేవారు ఉన్నారు. వీరు చుట్టు పక్కల మండలాల్లోనే కాకుండా జిల్లాస్థాయిలోనూ పలు పండగలకు వెళ్లి ప్రదర్శనలు ఇస్తూ ఉంటారు. కరజాడలోని కళాకారులకు ఇటీవల మంచి అవకాశాలు వచ్చాయి. ఇతర రాష్ట్రాలైన కలకత్తా, ఒడిశా, జార్జండ్‌లో ప్రదర్శనలు ఇచ్చారు. కరజాడకు చెందిన లోకనాథం, జగన్, జగనాథం అనే మూడు జట్లు ఉన్నాయి. అందులో మర్రిపాడు-సి, చీపురుపల్లి, కరజాడ గ్రామాల్లోని కళాకారులకు మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఈ కళకు వందేళ్ల చరిత్ర ఉందని వారు చెబుతున్నారు. కానీ, వారికి ప్రభుత్వాలు గుర్తించడం లేదని పలువురు కళాకారులు అంటున్నారు.

25 ఏళ్లుగా...

నేను 25 ఏళ్లుగా 15 మందితో జట్టును ఏర్పాటు చేసుకుని అనేక కార్యక్రమాల్లో తప్పెటగుళ్ల కళను ప్రదర్శిస్తూ వస్తున్నాను. ప్రభుత్వాలు సహాయ, సహకారాలు అందిస్తే... మరింత ఉత్సాహంగా ప్రదర్శిస్తాం. ఎంతకాలంగా గొర్రెలను, మేపుకుని మేపుకుని జీవనం సాగిస్తూ... కళాప్రదర్శనలు ఇస్తున్నాం.

- తలగాన కృష్ణారావు, మర్రిపాడు-సి

రుణాలు ఇప్పించాలి

గత ఐదారేళ్లుగా సంక్రాంతి సంబరాల్లో అధికారులు, నాయకులు ఆహ్వానం మేరకు కళాప్రదర్శనలు ఇస్తున్నాం. కళాప్రదర్శనకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసుకునే ఆర్థిక స్థోమత లేదు. అందుకు ప్రభుత్వాలు స్పందించి ప్రత్యేక లోన్లు ఇప్పిస్తే కళాను కాపాడుకుంటాం. చాలాచోట్ల ఇచ్చిన ప్రదర్శనలకు ఆదరణ ఉంటుంది.

- సార లోకనాథం, కరజాడ

కళకు గౌరవం ఉంది

మండలంలోని చుట్టు పక్కల గ్రామాల్లో సైతం ఆటలకు వెళ్తూ ఉంటాం. మా తప్పెటగుళ్ల విలువ తెలిసిన వారు మాకు బ్రహ్మరథం పడతారు. మంచి భోజనం పెట్టి గౌరవిస్తారు. మా కళ మాకు దైవం. ప్రభుత్వమూ స్పందించి మాకు ఒక ప్రత్యేక గుర్తింపు కల్పిస్తే మంచిది.

- బదకల కృష్ణమూర్తి, మర్రిపాడు-సి

'ఓక్లాండ్'లో దీపావళి సంబరాలు

ప్రజాశక్తి- టెక్కలి

పండగలు పర్యావరణ హితంగా ఉండాలని ఓక్లాండ్ పాఠశాల ప్రిన్సిపాల్ మళ్ల మధులత అన్నారు. పాఠశాల ఆవరణలో సోమవా రం దీపావళి సంబరాలను నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలకు అనుగుణంగా బోధన ఉండాలన్నారు. ఈ సందర్భంగా రంగవల్లులు తీర్చిదిద్ది వేడుక చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోహిణమ్మ జీవితం ఆదర్శం

ప్రజాశక్తి- సోంపేట

మామిడిపల్లిలో కమ్యూనిస్టు ఉద్యమానికి, మహిళా అభ్యున్నతికి కామ్రేడ్ పాతిన రోహిణమ్మ నిలిచారని, ఆమె జీవితం అందరికీ ఆదర్శనీయమని కామ్రేడ్ జుత్తు సింహాచలం అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో పాతిన రోహినమ్మ 5వ వర్ధంతి సభలో రైతు సంఘం నాయకులు, మహిళా సంఘం నాయకులు విద్యార్థి, యువజనులు ఆదివారం నిర్వహించారు. ముందుగా రోహినమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాతిన కృష్ణమూర్తి మాస్టర్ ఇల్లే ఒక ఉద్యమ కేంద్రం, ఆ ఉద్యమ కేంద్రంలో ఒక ఆదర్శవంతమైన గృహిణిగా, పోరాడే మహిళా నాయకురాలుగా, ప్రజల్లో తలలో నాలుకలా మెలిగిన ఆమె జీవితమే ఆదర్శమని అన్నారు. రోహిణమ్మ ఒక శక్తివంతమైన మహిళగా, కమ్యూనిస్టుగా తన జీవితాన్ని గడిపారని అన్నారు. గ్రామంలో అనేక మంది మహిళలను ఉత్తేజితున్ని చేయడంలో కీలకమైన భూమిక పోషించారని తెలిపారు. రైతు సంఘం ప్రధాన కార్యదర్శి మర్రి లోకనాథం మాట్లాడుతూ రోహిణమ్మ లేని లోటు గ్రామంలో కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాధవరావు, పాతని కృష్ణమూర్తి మాస్టర్, గొరకల లింగరాజు, గేదెల చినబాబు, కల్లేపల్లి గోపి, తెప్పల పాపారావు, కర్రి సింహాచలం, గొరకల మన్మథరావు, నూకల సోమేశ్వరరావు, సంగారు ధర్మరాజు, గరకల లక్ష్మీనారాయణ, తాళపత్ర రామారావు, గోరకల నిర్మల, బొంగు అరుణ, సంగారు రుక్మిణమ్మ, జుట్టు కృష్ణవేణి పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

చెరువులో పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

లచ్చుం (ఫైల్)

మండల కేంద్రంలోని గొల్ల వీధికి చెందిన మన్నేల లచ్చుం (70) శివాలయం వద్ద ఉన్న చెరువులో పడి మృతి చెందారు. సోమవారం ఉదయం స్నానానికి చెరువులోకి వెళ్లాడు. స్నానం చేస్తుండగా లోయలోకి వెళ్లిపోయాడు. దీనిని గమనించిన గ్రామస్తులు కాపాడేందుకు ప్రయత్నించారు. అయినా ఫలితం లేకపోవడంతో అప్పటికే మృతి చెందారు. మృతుడికి భార్య గంగమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సమాచారం అందున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. జె.ఆర్.పురం ఎస్ఐ జి.రాజేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జె.ఆర్ పురంలో చోరీ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండల కేంద్రంలో దొంగలు హల్‌చల్ చేస్తూనే ఉన్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఎక్కడో ఒకచోట చోరీలకు పాల్పడుతూనే ఉన్నారు. కొన్ని తెరపైకి వస్తున్నాయి... మరికొన్ని మరుగున పడుతున్న సంఘటనలు ఉన్నాయి. ఆదివారం రాత్రి మరో సంఘటనతో ఈ ప్రాంతం కలకలం రేగింది. మండల కేంద్రం లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్న ఓ పరిశ్రమ ఉద్యోగి ఎస్.నరసింహమూర్తి ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. ఈ చోరీలో నాలుగు తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.30 వేలు నగదు పోయినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. లక్ష్మీనగర్ లో నివాసం ఉంటున్న నరసింహమూర్తి, భార్య పార్వతి ఇటీవల తన కన్నవారి ఇంటికి వెళ్లారు. ఆదివారం రాత్రి విధులకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని పసిగట్టిన దొంగలు అపహరణకు పాల్పడ్డారు. విషయం తెలిసిన వెంటనే జె.ఆర్.పురం ఎస్ఐ జి.రాజేష్ సంఘటనా స్థలానికి పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దగ్ధమైన ఇల్లు

రాపాకలో పూరిల్లు దగ్ధం

పొందూరు: మండలంలోని రాపకలో ఆదివారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో పురిల్లు దగ్ధమైంది. దీపావళి సందర్భంగా గ్రామంలో బాణసంచా కాలుస్తుండగా నిప్పు రవ్వ ఎగిసిపడడంతో సంచాన వెంకన్న చెందిన ఇల్లు కాలిపోయింది. మంటలు ఒక్కసారిగా ఎగిసిపడడంతో సమీపంలో ఉన్నవారు వెంటనే స్పందించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు.

తప్పుడు ఆరోపణలు చేయొద్దు

వ్యాపారి రాజేష్ భార్య సునీత

మాట్లాడుతున్న రాజేష్ భార్య సునీత

ఇచ్ఛాపురం : పట్టణంలో వ్యాపారవేత్త ప్రత్తి రాజేష్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మృతుడి భార్య సునీత ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తన భర్త రాజేష్ మృతి అతను ఎరి కోరి తెచ్చుకున్న ఘటన అని అన్నారు. తమ ఇద్దరు మధ్య అభిప్రాయ బేధాలు ఉన్నా మాట వాస్తవమేనని, కానీ, అతని చెడు తిరుగుడులు, వివాహేతర సంబంధాలు వల్ల అనేకసార్లు హెచ్చరించానని అన్నారు. ఆయనలో మార్పు రాకపోతే దూరంగా ఉంటూ వస్తున్నానని తెలిపారు. తమ మధ్య దూరం పెరగడంతో పరస్పర అంగీకారంతో విడిపోవడానికి ఏర్పాట్లు చేసుకున్నానని అన్నారు. ఈ సందర్భంలో రాజేష్‌కు అప్పులు, బాధలు ఎక్కువ అవ్వడంతో, వివాహేతర సంబంధాలు ఒత్తిడి పెరగడంతో ఆత్మహత్య చేసుకుని ఉంటారని అభిప్రాయపడ్డారు. తన భర్తను చంపేంత కర్కోటకురాలిని కానని అన్నారు. కొంతమంది తెలిసీ, తెలియక, ఉద్దేశపూర్వకంగా తమపై బురద జల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేవారు. నిజం నిలకడగా తెలుస్తుందన్నారు. ఈమెతో పాటు ఆమె తల్లి ఉన్నారు.

టిడిపి విజయానికి కృషి చేయాలి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రతి కార్యకర్తా వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి ఇప్పటి నుంచే కష్టపడి పనిచేయాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. మండలంలోని నిమ్మడలోని తన ఛాంబర్‌లోని జిల్లాలోని టిడిపి నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం విస్తృతంగా చేపట్టాలన్నారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని భరోసా కల్పించాలన్నారు.

కార్యకర్తలతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, తర్ర రామకృష్ణ, గొండు లక్ష్మణ రావు, వెలమల కామేశ్వరరావు, హనుమంతు అప్పలరాజు పాల్గొన్నారు. ఆదివారం రాత్రి అచ్చెన్నాయుడు తన సతీమణి కింజరాపు విజయ మాధవి, కుటుంబ సభ్యులతో, గ్రామస్తులతో కలిసి ఘనంగా దీపావళిని జరుపుకున్నారు.

తిరుచానూరులో నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురానికి చెందిన నాట్య కళాకారులు అరుదైన అవకాశం లభించింది. తిరుపతి తిరుచనారు పద్మావతి అమ్మవారు ఆలయంలో అద్భుత నాట్య ప్రదర్శనకు ఇవ్వడంతో పలువురు ప్రశంసలు అందుకున్నారు. రసవత్తరంగా సాగిన ఈ నాట్యప్రదర్శన తిరుమల తిరుపతి దేవస్థానం తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహోత్సవాల్లో భాగంగా 11, 12 తేదీల్లో శిల్పారామం, పద్మావతి అమ్మవారి వాహన సేవలో వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమం నాట్యాచార్యులు ఏలేశ్వరపు శ్రీనివాసులు ఆధ్వర్యాన నిర్వహించారు. అకాడమీ అధ్యక్షులు వెంకటేశ్వర పట్నాయక్ (చిన్నా గురు స్వామి) దంపతులు నాట్య గురువు శృతి పట్నాయక్‌తో పాటు 25 మంది చిన్నారులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని రంజింప చేశారు. మహాగణపతిం, దశావతారం, రామాయణ శబ్దం, పిడికిట తలంబ్రాలు వచ్చెను, అలివేలు మంగ జయ జనార్థన గరుడ వాహన, అదివో అల్లది వో, పలు అన్నమయ్య కీర్తనలకు అమ్మవారి పాటలకు నృత్యం చేశారు. చిన్నారుల తల్లిదండ్రుల తో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ అధికారులు పాల్గొని చిన్నారులను అభినందించారు.

శ్రీలత...

ఆమదాలవలస : తిరుమల తిరుపతి కేంద్రంగా తిరుచనూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహోత్సవాల్లో పట్టణానికి చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి కూన శ్రీలత నృత్య రూపకాన్ని ప్రదర్శించింది. పట్టణంలోని నాట్యశ్రీ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకులు శ్రీలత కూచిపూడి నృత్య విశ్వవిద్యాలయం నుంచి సర్టిఫికెట్ కోర్సుతో పాటు డిప్లమో (నృత్యం) దూరదర్శన్ బి-గ్రేడ్ ఉత్తీర్ణత పొందింది. ప్రస్తుతం కూచిపూడి విశ్వవిద్యాలయంలో కూచిపూడి నత్యంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతుంది. ప్రముఖ నాట్యాచార్యులు డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు సారథ్యంలో పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో శ్రీలత తన అద్భుత నృత్య ప్రదర్శనతో ఆహుతులను అలరించి పలువురి మన్ననలను పొందడంపై పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

ఇచ్ఛాపురం : నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

కండువా వేస్తున్న పరమేశ్వరరావు

కాంగ్రెస్‌లోకి చక్రవర్తిరెడ్డి

ప్రజాశక్తి- టెక్కలి

ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంపిపి, కేశుపురం ఎంపిటిసి, వైసిపి నాయకులు ఎం.చక్రవర్తిరెడ్డి కాంగ్రెస్‌లోకి చేశారు. ఈ మేరకు పాతనౌపడలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు నివాసగృహంలో బుధవారం కండువ వేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు 'మా ఇంటికి రండి' కార్యక్రమంలో భాగంగా పార్టీ ఇచ్చిన పిలుపునకు స్పందించి చక్రవర్తిరెడ్డి సొంత పార్టీలోకి చేరడం అభినందనీయమని అన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలన్న మాజీ సిఎం వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి కోరిక నిజం చేసేందుకు పార్టీలో చేరుతున్నట్లు చక్రవర్తిరెడ్డి తెలిపారు. వైసిపి మండల ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు కోత మధుసూదనరావు, పేడాడ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంచిలి : పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

జగన్ పాలనంతా అవినీతిమయమే

ప్రజాశక్తి- కంచిలి

నాలుగున్నరేళ్లలో జగన్ పరిపాలనంత అవినీతిమయమే అని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని ఎస్సార్పీపురంలో బాబు షూరిటీ-భవిష్యత్‌కు గారంటీ కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో కలసి సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన వివిధ పథకాలను గురించి తెలియచేశారు. అలాగే ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను గురించి వివరించారు. ప్రతి అంశంలోనూ అవినీతి తప్ప... పాలన ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తే నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు మాదిన రామారావు, టి.వి.రమణ, కురయ్య, ఎం.ఎం.పట్నాయక్, వి.రవి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని హుకుంపేటలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యాన బాబు ష్యూరిటీ-భవిష్యత్ నిర్వహించారు.

గార : గారలోని బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఇంటింటికీ వెళ్లి పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో రాధాకృష్ణారెడ్డి, రాజేష్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

బూర్జ : మండలంలోని పాలవలసలో నిర్వహించిన బాబు షూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో టిడిపి బిసి సెల్ అధ్యక్షులు మామిడి దుర్గారావు, దాసిరెడ్డి వెంకనాయుడు, జల్లు పోలునాయుడు, కడగల కృష్ణ, నారాయణరావు పాల్గొన్నారు.

పార్టీ కండువా వేస్తున్న వెంకటరమణ

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలో సోమరాజపురం పంచాయతీ శోభనాపురానికి చెందిన 60 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే కలమాట వెంకటరమణ సమక్షంలో సోమవారం టిడిపిలోకి చేశాయి. వీరికి టిడిపి కండు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో ఆల్తి సూర్యనారాయణ, మజ్జి శంకరరావు, బిడ్డిక చిరంజీవి, ఉయ్యాక సన్యాసి, కె.అప్పారావు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసిపి పాలనలో అస్తవ్యస్తంగా తయారైందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు అగతముడి మాధవరావు, సర్వేశ్వరరావు, బి.గోవిందరావు పాల్గొన్నారు.

నేడు ఉచిత మధుమేహ పరీక్షలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాతబస్టాండ్ వద్ద రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మెడిసిన్ బ్యాంకు వద్ద ఈనెల 14న ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు మధుమేహ వ్యాధి వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ కెల్ల చిన్నబాబు ఆధ్వర్యాన ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వైద్య పరీక్షల అనంతరం రోగులకు తగిన మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిరీష అడ్డగింత

వజ్రపుకొత్తూరు: గౌతు శిరీష గో బ్యాక్ అంటూ మంచినీళ్లపేట గ్రామస్తులు వాహనాన్ని సోమవారం అడ్డుకున్నారు. తప్పుడు సమాచారంతో రాజకీయ ప్రయోజనాల కోసం పత్రికలకు ఎక్కుతూ గ్రామస్తులపై బురద జల్లుతున్నారని, దీనికి సమాధానం చెప్తే వరకూ కదలనివ్వమని వైస్ ఎంపిపి వంక రాజు, సర్పంచ్ సత్యరాజు భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో వైసిపి, టిడిపి నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. సోమవారం టిడిపి కార్యకర్తల సమావేశానికి నువ్వుల రేవు మీదుగా శిరీష వాహనంలో వస్తుంది. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు మంచినీళ్లపేట పాఠశాల రోడ్డు వద్ద గ్రామస్తులతో అడ్డుకుని నిలదీశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రామానికి చెందిన కారి లింగరాజు, కారి పుణ్యవతి మధ్య వ్యక్తిగత కక్షతో గొడవ జరిగిందన్నారు. ఈ గొడవలో తనకు తానుగా గాయం చేసుకొని లింగరాజు ఆస్పత్రిలో చేరారని అన్నారు. ఆ సమయంలో గౌతు శిరీష, స్థానిక మాజీ సర్పంచ్ చిన్నారావు, టిడిపి నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించి వైసిపి గుండాలు టిడిపి కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని పత్రికల్లో తప్పుడు స్టేట్‌మెంట్ ఇచ్చారని వంకరాజు, సత్యరాజు ఆమెపై అగ్రహారం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ గందర గోల పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు గ్రూపులను సర్ధిచెప్పడంతో సమస్యల సద్దుమనిగింది.

శిరీషను అడ్డుకున్న వైసిపి నాయకులు

ఘనంగా బోనాల ఉత్సవం

పొందూరు: స్థానిక అక్కమాంబ పేరంటాళ్ల బోనాల ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబ సమేతం, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, అనకాపల్లి గోవిందరావు, గాడు నాగరాజు, బండారు జైప్రతాప్ కుమార్, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహనరావు, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర్ భాస్కరరావు, బాడాన శేషగిరినాయుడు, పైడి రాంబాబు పాల్గొన్నారు.

దర్శించుకుంటున్న స్పీకర్ దంపతులు, కూన రవికుమార్

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

టెక్కలి : మంగళవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి బి.రూపావతి తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ చేతుల మీదుగా వారోత్సవాల పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ వారోత్సవాల్లో విద్యార్థులకు క్విజ్, చదరంగం, వ్యాసరచన, వివిధ రకాల పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ఆట్ల సరోజనమ్మ, సర్పంచ్ గొండేల సుజాత, గుజ్జు మోహన్‌రెడ్డి, చిగిలిపల్లి వైకుంఠరావు పాల్గొన్నారు.

పోలాకి: ఈ నెల 14 నుంచి పోలాకి శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి కె.మానస ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో అదికారులు, ప్రజాప్రతినిధులు, పాఠకులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దీర్ఘాశి మినీ గ్రంథాలయాధికారి పి.వి.ఎస్.ఎన్.మూర్తి, సిబ్బంది ఉన్నారు.

టెక్కలి : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

ఇచ్ఛాపురం : మంగళవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని గ్రంథాలయాధికారి పుర్ణచంద్ర బెహరా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారం రోజుల పాటు విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని అన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ శాఖా గ్రంథాలయంలో మంగళవారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధికారి బి.రూపావతి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ బృందాదేవి చేతుల మీదుగా పోస్టర్‌ను విడుదల చేశారు. ఉపాధ్యాయులు, పాఠకులు, విద్యార్థులు వారోత్సవాల్లో పాలుపంచుకోవాలని కోరారు.

ముస్తాబైన శైవ క్షేత్రాలు

కవిటి: కార్తీక మాసం పురస్కరించుకుని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. పూలదండలు, లైట్లతో జిల్లా వ్యాప్తంగా శివాలయాలు వెలుగులు జిమ్ముతున్నాయి. మండలంలోని ప్రగడపుట్టుగ శివాలయానికి విద్యుత్ లైట్లు అలకరించారు. శివ కేశవులకు పవిత్రమైన కార్తీక మాసంలో వైష్ణవ, శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతాయి.

లైట్ల వెలుగులో శివాలయం

పోటీతత్వంతోనే విద్యార్థుల రాణింపు

బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ వెంకటరమణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్ సుసాధ్యమని ఎంఇఒ బి.వెంకటరమణ అన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని గరుడభద్ర షైనింగ్ స్టార్ యువజన సంఘం, గరుడభద్ర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యాన సోమవారం నియోజకవర్గ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి మందస మండలం కొత్తపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు, ద్వితీయ బహుమతి హరిపురం ఉన్నత పాఠశాల, తృతీయ బహుమతిని వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థుల బృందం కైవసం చేసుకున్నారు. ప్రైజ్ మనీగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య మనిషికి మూడో నేత్రం అని అన్నారు. ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థులకు తరగతి పుస్తకాలు పఠనం, జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యకు ప్రాధాన్యం ఇస్తూ, విద్యార్థులను అనేక విధాలుగా ప్రోత్సహిస్తున్న షైనింగ్ స్టార్ యువజన సంఘం సభ్యులను అభినందించారు. సర్పంచ్ ప్రతినిధి గూడ ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షుడు వై.ధర్మారావు, యువజన సంఘం అధ్యక్షుడు వై.సంతోష్‌కుమార్, హెచ్ఎంలు దిలీప్ కుమార్ సాహు, శ్రీనివాస్, మెట్టూరు సర్పంచ్ అప్పారావు, కె.మోహనరావు, ధనరాజ్, ఎన్.సత్యం, ఓంకార్, పి.కళ్యాణ్, రాకేష్, వై.జోగారావు, జి.నగేష్, కె.రామారావు, ఎన్.ఆదినారాయణ పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న స్పీకర్ సీతారాం

ఆలయ అభివృద్ధికి కృషి

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని పోలపాలమ్మ అమ్మవారి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆలయ కమిటీ సభ్యులతో, మున్సిపల్ అధికారులతో కలసి ఆలయంలో జరుగుతున్న పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు రోడ్డు ఇరువైపులా దేవత మూర్తుల పోస్టర్లను అంటించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య శాఖ ఇఇ సుగుణాకర్, ఇంజినీరింగ్ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ఆమదాలవలస : జిల్లాలోని న్యాయస్థానాల్లో న్యాయవాదులకు మౌలిక వసతులు కల్పించాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర కమిటీ సభ్యులు బొడ్డేపల్లి మోహనరావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని కోర్టు భవనం శిథిలావస్థకు చేరుకుందని, కక్షిదారులు కూర్చోవడానికి కుర్చీలు, కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం తాగునీటి సౌకర్యానికీ నోచుకోని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు ఇక్కడి పరిస్థితులను వినతిపత్రాల రూపంలో సమర్పించినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులు, శాసనసభ స్పీకర్ ఉన్నా న్యాయస్థానాల్లో మౌలిక వసతుల కల్పనకు నోచుకోని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు.

పనుల మధ్యలో శంకుస్థాపనలా!

టిడిపి రాష్ట్ర కార్యదర్శి సూర్యం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

రాష్ట్రంలో ఎన్నికలు దగ్గర పడుతుండడంతో వైసిపి నాయకులు పూర్తయిన పనులకు శిలాఫలకాలు వేయడమే పనిగా పెట్టుకున్నారని, హద్దు అదుపు లేకుండా కార్యక్రమాలను చేపడుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యం విమర్శించారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. పనులు చేపట్టిన తర్వాత శిలాఫలకాలు వేయడంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అందరికంటే ముందంజలో ఉంటారని వ్యంగ్యంగా విమర్శించారు. ఇటీవల సరుబుజ్జిలి మండలంలో స్పీకర్ శంకుస్థాపన చేస్తున్న శిలాఫలకాలు ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయన్నారు. శుక్రవారం మండలంలోని చిగురువలస, వెన్నెలవలస గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనుల నిర్మాణానికి స్పీకర్ శంకుస్థాపన చేశారని, అయితే ఆ రెండు గ్రామాల్లో కాంట్రాక్టర్‌గా ఉన్న నారీ కంపెనీ గడచిన మూడు నెలల నుంచి పనులను ప్రారంభించి తాగునీటి బోర్లు తవ్వకాలు, పైపులైను నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. పనులు చివర దశలో ఉన్న సమయంలో స్పీకర్ శంకుస్థాపన శిలాఫలకాలు ఆవిష్కరించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. వెన్నెలవలసలో గతంలో జరిగిన జలజీవన్ మిషన్ పనుల ఫొటోలను టిడిపి నాయకులు ప్రదర్శించారు. ఇప్పటికైనా ఇటువంటి చౌకబారు పనులను మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు అంబల్ల రాంబాబు, కందుల వెంకటరావు, మీసాల రామారావు, లావేటి పూర్ణారావు, తాడేల వెంకటరమణ, కొమనాపల్లి రవికుమార్, ధవళ సింహాచలం, ఇల్లాకుల ప్రభాకర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సూర్యం

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ఉన్నత విద్యకు 'ఉద్దానం హెల్పింగ్' భరోసా

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పూజ ఉన్నత విద్యకు ఉద్దానం హెల్పింగ్ సొసైటీ భరోసాగా ఉంటుందని సంస్థ సభ్యులు తెలిపారు. ఈ మేరకు విద్యార్థినిని కలసి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫీజు రూ.12 వేలు సోమవారం అందజేశారు. నారాయణరావుపేటలో నివాసముంటున్న ఒంటరి మహిళ రూప తన ఆర్థిక పరిస్థితి బాగోలేక తన కుమార్తె విద్య కోసం ఉద్దానం హెల్పింగ్ సొసైటీ వారిని సంప్రదించిందన్నారు. రూప భర్తను, కుమారుడిని కోల్పోవడంతో ఆమె కుమార్తె రూప ఉన్నత విద్యకు సహాయ పడుతున్నామని అన్నారు. పోస్టాఫీసులో ప్రతినెలా రూ.500 రికరింగ్ డిపోజిట్ చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో రుద్రమూర్తి, రాహుల్, తిరుపతి, జోగారావు, కళాశాల ప్రిన్సిపాల్ కైలాష్, షణ్ముఖరావు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న లయన్స్ ప్రతినిధులు

20 మంది రక్తదానం

శ్రీకాకుళం అర్బన్ : లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు పి.రవికుమార్ నగరంలోని ఖ్యాతి వృద్ధ జనాశ్రమంలో వృద్ధులకు రొట్టెలు, పళ్లు డ్రై ఫ్రూట్స్ సోమవారం అనంతరం అనంతరం లయన్స్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరాన్ని నిర్వహించి 20 యూనిట్ల రక్తదానం చేశారు. వరల్డ్ కైండ్ నెస్ ప్రోగ్రాంలో భాగంగా నిరుపేదలకు దుస్తులు, నిత్యావసర సరకులు అందజేశారు. క్లబ్ జోన్ ప్రెసిడెంట్ డాక్టర్ బాడన దేవభూషణరావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యాన అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి టి.రాంగోపాల్, సెక్రటరీ శిల్లామణి, ఎల్‌సి ఐఎఫ్ కో-ఆర్డినేటర్, సీపాన రమేష్‌కుమార్, సభ్యులు బి.ఉమామహేశ్వరరావు, గుత్తు చిన్నారావు, రవి, రాము, కామేష్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

సరుబుజ్జిలి : ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కళాజాత బృంద సభ్యులు కె.శంకరరావు, సత్యనారాయణలు పేర్కొన్నారు. మండలంలోని విజయరాంపురంలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆదివారం ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు నృత్య రూపంలో ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్, ఎటిఎం వివరాలను అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. బ్యాంకు అధికారులు ఎప్పుడూ ఖాతాదారుల వివరాలను ఫోన్ చేసి తెలుసుకోరని తెలిపారు. ఎటిఎంల్లో అపరిచితులకు కార్డును ఇచ్చి డబ్బులు విత్ డ్రా చేసి పెట్టమని కోరరాదని సూచించారు. రూపే ఎటిఎం కార్డుల ప్రయోజనాలను వివరించారు. బ్యాంకులో అమలవుతున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన ఇన్స్యూరెన్స్ పథకాల వివరాలను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెండి అప్పలనాయుడు, సిసి రాజ్యలక్ష్మి, గ్రామీణ బ్యాంకు బిజినెస్ కరెస్పాండెంట్ రేవతి, సిఎఫ్ రాజ్యలక్ష్మి, కళాజాతా బృందం సభ్యులు ఎం.లక్ష్మి, సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిన్ను, రామారావు పాల్గొన్నారు.

దుప్పట్లు, ఆహారం అందిస్తున్న సభ్యులు

హెల్పింగ్ హేండ్స్ దాతృత్వం

ప్రజాశక్తి- కవిటి

బొరివంక కేంద్రంగా పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ మరోసారి తన దాతృత్వం నిరూపించుకుంది. చలితో అవస్థలు పడుతూ సోంపేట, ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఉండే 25 మంది అభాగ్యులకు సోమవారం దుప్పట్లు, ఆహారం, తాగునీరు అందించారు. జిబిఎస్ వ్యాధితో బాధపడుతున్న శవసానపుట్టుగకు చెందిన ఈగల నాగేష్‌కు రూ.6 వేలు నగదు అందించారు. అనంతరం సంస్థ సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే లక్ష్యంగా సాగుతున్న తమ ప్రయాణానికి అజ్ఞాత వ్యక్తులు అందిస్తున్న సహకారం మరువలేనిదని, అవకాశం, ఆసక్తి ఉన్న వ్యక్తులు సామాజిక సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారం అందించాలని కోరారు.

యాత్రను విజయవంతం చేయాలి

నరసన్నపేట: ఈ నెల 15న నరసన్నపేట పట్టణంలో నిర్వహించనున్న సామాజిక సాధికారత బస్సు యాత్రను విజయవంతం చేయాలని నరసన్నపేట మేనేజర్ పంచాయతీ సర్పంచ్ బి.శంకర్ పిలుపునిచ్చారు. తమ కార్యాలయంలో సంతపేట, పురుషోత్తం నగర్, రాజీవ్ నగర్ వార్డు సభ్యులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య నాయకత్వంలో ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ యాత్రకు తీసుకొచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు పతివాడ గిరీష్, ఎంపిటిసి ఎన్.శ్రీనివాస్, పాపారావు, వీరేస్, ప్రసాద్ పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న సర్పంచ్ శేఖర్

'కుప్పిలి' కవితలకు స్వర్ణ కంకణం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణానికి చెందిన కవి, రచయిత కుప్పిలి వెంకట రాజారావుకు గంట వ్యవధిలో ఐదు కవితలు రాశారు. ఇందుకు గాను స్వర్ణ కంకణం బహుమతి లభించింది. అక్టోబరు 15న తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్‌కు చెందిన ఆర్యాణి సకల కళా వేదిక, గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థలు అంతర్జాల వేదికగా నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కవితల పోటీల్లో రాజారావు గంట వ్యవధిలో ఐదు కవితలు రచించారు. దీనికి గాను సాహితీ సామ్రాట్ రికార్డు పురస్కారాన్ని సోమవారం పోస్టల్ ద్వారా అందుకొని స్వర్ణ కంకణ విజేతగా నిలిచారు. ఆర్యాణి సకల కళా వేదిక సంస్థ అధ్యక్షులు దూడపాక శ్రీధర్ ఈ పోటీని నిర్వహించారు.

పురస్కారంతో వెంకటరాజారావు

పొగతో అవస్థలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కృష్ణాపురం సమీపంలో వందలాది క్వారీ వాహనాలు నిత్యం తిరుగుతున్నాయి. అందులో చాలా వాహనాలు కాలం చెల్లినవి. ఈ వాహనాల నుంచి దట్టంగా వస్తున్న పొగతో ప్రయాణాలు సాగించే వాహనదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆ పొగ నుంచి తప్పించుకునే క్రమంలో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటువంటి వాహనాలను నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లారీ నుంచి వస్తున్న దట్టమైన పొగ